REGD. NO. A. 40 విడి ప్రతి 0-3-0 శుక్రవారం 29-5-59

# జమీన్ రైతు

సంపుటి 31 : సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు : సంపాదకుడు :: నెల్లూరు శ్రీరామమూర్తి : సంచిక 22

## హైదరాబాద్ లేఖ

* * * మా విలేకరి * * *

# పత్రికా స్వాతంత్ర్యం-

## న్యాయాధీశులు, కోర్టులు, ప్రభుత్వాధికార్లు కొంత ఔదార్యం ప్రదర్శించడం అవసరం.

స్వతంత్ర భారతంలో భావప్రకటనా స్వాతంత్ర్యం దినదినం కుంచించుకోపోతున్నదని చెబితే అతిశయోక్తి కాదు. ఇటీవల జీవితబీమా సంస్థ వ్యవహారంలో విచారణ కొనసాగించిన వివియన్‌బోస్ నివేదిక ప్రభుత్వానికి అంది, ఇంకా ప్రభుత్వం దానిని పరిశీలించక ముందే కొన్ని పత్రికలు, నివేదిక గురించిన భోగట్టా వెల్లడిచేస్తూవార్తలు ప్రకటించినందుకు పార్లమెంటు సభ్యులు అభ్యంతరం చూపారు. ముందు తమకు తెలుపకుండానే పత్రికలకు నివేదిక గురించి "తెలియజేసి"నందుకు ప్రభుత్వాన్ని సభ్యులువిమర్శించారు. నివేదిక ప్రభుత్వానికి అందిన కొద్ది గంటల్లోనే పత్రికలు ఎలా ప్రచురించగలిగాయో తెలీదు; అయినా అఫిషియల్ సీక్రెట్స్ ఆక్టును ఇంకా కట్టుదిట్టంగా అమలుచేయాలని ప్రధాన మంత్రి నెహ్రూ చెప్పారు. దేశభద్రతకు ఏ మాత్రం సంబంధంలేని వార్తాప్రకటన గురించి ప్రజాస్వామికవాది, స్వాతంత్ర్య యోధుడు అయిన జవహర్లాల్ నెహ్రూగారే ఆ విధముగా అభిప్రాయపడినప్పుడు, అంతకంటే తక్కువస్థాయిలో ఉన్నవారు ఎలాంటి వైఖరి అవలంబిస్తారో చెప్పనవసరంలేదు.

ఇటీవల ఆంధ్రప్రదేశ శాసనసభలో జరిగిన ఒక చర్చ గురించిన ప్రకటన "ఆంధ్రపత్రిక"లో పూర్తిగా తప్పు పడిందని, అలా వ్యాఖ్యానించకూడదని, పత్రిక క్షమార్పణ ప్రకటించాలని సభాపతి అయ్యదేవర కాళేశ్వరరావు తీర్పు చెప్పారు.

గతవారం హైదరాబాదు చీఫ్ సిటీ మేజిస్ట్రేట్ గారొక తీర్పు చెప్పారు. అందులో నగరంలోని ఒక ఉర్దూ పత్రిక సంపాదకునికి, ఒక నేరం పరిశోధనలో పోలీసు అధికార్లతో సహకరించ నిరాకరించినందుకు నేరంపై ఐ.పి.సి. 175 సెక్షన్ క్రింద శిక్ష విధించారు. నిజాం నవాబు నగ ఒకటి పోయిందనీ, తరువాత దొరికిందని ఈసంపాదకుని పత్రికలో ప్రచురించారు. పోయినమాట నిజం. మళ్లీ దొరికిందని వ్రాసినందున, ఈ చోరీ గురించి ఈ సంపాదకునకు ఏమైనా తెలిసి ఉండాలనో ఏమో, ఈ చోరీ దర్యాప్తు చేయవలసిన బాధ్యతగల పోలీసు అధికారి పరిశోధనలో తనతో సహకరించవలసిందని ఈ సంపాదకునికి వ్రాశాడు. అతను నిరాకరించాడనీ, ఈ విధంగా అధికారాన్ని ధిక్కరించాడనీ, సంపాదకునిపై నేరారోపణ చేయబడింది. కోర్టులో న్యాయమూర్తి శిక్ష విధించారు.

చట్టరీత్యా పరిశోధనలో ప్రభుత్వోద్యోగితో సహకరించ నిరాకరించడంలో ఈ పత్రికా సంపాదకుడు, న్యాయమూర్తి నిర్ణయించినట్లు, నేరం కావచ్చును. కాని ఇలాంటి తీర్పువల్ల ఈ దేశంలో పత్రికాస్వాతంత్ర్యానికి తీవ్రమైన ప్రతిబంధకాలు ఏర్పడ్తాయి.

తమకు సమాచారం తెలిపిన వ్యక్తినిగూర్చి గాని (ఇంగ్లీషులో "సోర్స్" అంటారు), లేక సమాచారం అందిన వైనంగూర్చి గాని వెల్లడిచేయకూడదని ప్రజాస్వామిక దేశాలన్నింటిలో పత్రికా రచయితలు, సంపాదకులు అనుసరిస్తున్న సంప్రదాయం. ఇది వారి పవిత్ర కర్తవ్యంగూడా. ఈ సంప్రదాయమే లేకపోతే పత్రికలకు వార్తలు, సమాచారమూ లభించడమే దుస్తరమవుతుంది. ఇలాంటి వార్తను ప్రచురించిన ఏ సంపాదకుడైనా, విలేకరి అయినా ప్రభుత్వోద్యోగులతో నేర విచారణలో మనస్ఫూర్తిగా సహకరించాలంటే, తనకు సమాచారం ఇచ్చిన వ్యక్తిని గురించి లేక ఆ సమాచారం అందిన వైనం గూర్చి అధికార్లకు తెలియచేయవలసి వుంటుంది. ఇది సంపాదకునిగా అతను నిర్వర్తించవలసిన కర్తవ్యానికి, బాధ్యతకు విరుద్ధమవుతుంది.

దేశభద్రతకు, ప్రజల సంక్షేమానికి ప్రమాదం సంభవించే సందర్భాలలో వినా, అందరికీ తెలియని రహస్యాలను బయటపెట్టడం; ఏదైనా ఒక విషయంగూర్చి సమాచారం వివరాలు సేకరించి ప్రచురించడం; ఒక ఉదంతాన్ని, లేక బహిరంగ చర్చను వ్యాఖ్యాన సహితంగా ప్రచురించడంలాంటి ప్రధానమైన స్వాతంత్ర్యం, స్వేచ్ఛ పత్రికలకు, రచయితలకు లేకపోతే, ఈ దేశంలో ప్రజలకు ఉపయోగకరంగా పత్రికలను నిర్వహించడమే అసాధ్యమవుతుంది. పత్రికలన్నీ కేవలం ప్రభుత్వ గెజెట్లు అవుతాయి.

న్యాయాధీశులు, కోర్టులు, ప్రభుత్వాధికార్లు, దేశంలో ప్రజాస్వామ్యం సుస్థిరం కావడంకోసం, పత్రికా స్వాతంత్ర్యంపట్ల కొంత ఔదార్యం ప్రదర్శించడం అవసరం.

—కొంత 12 వ పేజీలో



అమెరికా విదేశాంగ మంత్రిగా విశ్వఖ్యాతి పొందిన స్వర్గీయ డల్లెస్



దేశంలో ఏమూలజూచినా ఏదోఒక అభివృద్ధి కార్యం జరుగుతున్నది. సమాజాభివృద్ధి కార్యక్రమం ప్రజలచే స్వయం సహాయాన్ని, విలువను గుర్తింపజేసినవి. దారి డొంకలేని పల్లెలకు రోడ్లు పడుతున్నవి. ఆస్పత్రులు, పాఠశాలలు – ఒకటేమిటి గ్రామసౌకర్యాన్ని ప్రభుత్వ సహాయంతో ప్రజలే ఏర్పాటుజేసుకుంటున్నారు. అలాంటి స్వయంకృషితో ఏర్పడిన రోడ్డును ఈచిత్రంలో చూడవచ్చు.

# చిత్రజగత్

'ఫ్రదం' సమీక్ష

ధ్యేయంతో సంబంధం నిలబెట్టుకోలేక పోయిన కామేశ్వరరావుగారి చిత్రం.

## రేచుక్క-పగటిచుక్క

అనగా అనగా ఓ అబ్బాయి, ఫలానా అని తెలియక వాళ్ల నాన్నే పోలీసులకప్పచెప్పాడని చెప్పేందుకు, నిజం ఒప్పుకుంటే, పదిహేను వేల చిల్లర అడుగుల ఫిలిం ఖర్చు చేయవలసిన అవసరం లేదు. వందల మంది ఎక్స్‌ట్రాలను, తెరంతాకెక్కిన జనసాంద్ర దృశ్యాలు చూపించవలసిన అవసరంకూడా లేదు. స్వస్తిశ్రీ వారి 'రేచుక్క–పగటిచుక్క'లో ఉన్న అంశాలు అనేకం లేకుండానే ఆ ఒక్క ముక్కనీ మనం జాలిపడేలా, బాధపడేలా చెప్పవచ్చును. ఆమాటకొస్తే ఆ విషయాన్ని రేచుక్క–పగటిచుక్కలోని హంగులు చాలావరకు లేకుండానే ఆ సినిమా చెప్పినదానికంటే బాగా చెప్పవచ్చు.

కాని, భారతదేశంలో భావప్రకటన కనీసపు హక్కు. హక్కును వాడుకోవడంలో, మంచిఫిలిం కొరత, సెన్సారుల కత్తెర మినహా మన నిర్మాతలకు ఏ ఆటంకాలూ లేవు. అంచేత ఒక ముక్కలో పోయేదానికి ఆయన పది ముక్కలు వాడుకుంటే ఆ మిగిలిన తొమ్మిది ముక్కలు, అవసరమైన ఆ ఒక్క ముక్కకీ ఏవిధమైన సహాయం చేయకపోగా దాంట్లో ఉన్న కొద్ది పసనూ దోచేస్తే మనం చేయగలిగిందల్లా విచారించడం మాత్రమే.

అనగా అనగా ఓ రాజు. మీరూహించినట్టే చపలచిత్తుడు. తమ్ముడు క్రూరుడు. వాళ్ల అన్ననికి అడగకుండానే 'షర్' సంతకాలు పెట్టేసి ఆర్డర్లు పాస్ చేస్తుంటాడు. వీరి దేశంలో ఆశక్తి సజ్జనుడు ఓ సేనాని, న్యాయప్రియుడు ఓ సామంతరాజు. మొదటి రీల్లో అన్యాయం న్యాయాన్ని సవాలు చేయడం, న్యాయం ప్రవాసంలోకి వెళ్ళి, మళ్లీ తిరిగిరావడం, వచ్చి అన్యాయానికి ఓ 'వాకౌట్' ఇచ్చి పంపించేయడం రేచుక్క సారాంశం.

ఈ సారా(ంశం)లోకి సోడాలా సినీ మాత కళ్యాణం ఉపన్యాసాలు, కుస్తీలు, కవాతులు, డాన్సులు, అమ్మాయిలు, రేలంగి గిలిగింతలు, చిత్రిస్తూ పదిహేను వేల అడుగుల దాకా పొడిగించిన హంగులు. కామేశ్వరరావుగారి దృష్టి, కృషి, అసలు కథదాకా పోనీకుండా చేసిన అంశాలు. రెహ్మాన్ ఛాయాగ్రహణం, రంగారావు వ్యక్తిగత ప్రయత్నం, దర్శకుని మనసిక్కడ లేదన్న విషయం మరిపించిన అలంకారాలు.

ధ్యేయంతో సంబంధం నిలబెట్టుకోలేకపోయిన కామేశ్వరరావుగారి ప్రయత్నం 'రేచుక్క' చిత్రం.

అన్నిరంగాల్లోనూ తెలుగు సినిమా లనుభవిస్తున్న దారిద్ర్యానికి నిదర్శనం

## కూతురు కాపురం

ఇంతవరకు మనకొచ్చిన తెలుగు సినిమాలు, ఇప్పుడిప్పుడే మనం మర్చిపోవడం మొదలెడుతున్న హిందీ సినిమాలు అంటుగా తయారుచేసి దానిని హాలీవుడ్ సినిమాల నీడన పెంచితే పెరిగే చెట్టుకు నిదర్శనం, కూతురు కాపురం.

లక్షాధికారికి అమ్మాయినివ్వాలని, బావి తోదూకి కంఠం సెగ్గించుకున్న తల్లికి, ఐతే నన్నాళ్లూ మాటపాటికి పోయినా చర్చి శాసించిన తండ్రి, అత్తగారి ఆస్తితోనే లక్షాధికారి కావలసిన అల్లుడు, మొదటి రీల్లోనే అందరి జీవితాల్లోంచి మాయమయిపోయి, ఆఖరి రీల్లో వాటిని మళ్లీ కలిపావను కొన్నవాన, వీరంతా ఇంతవరకు వచ్చిన మన తెలుగు చిత్రాలనుంచి కూతురు కాపురం తెచ్చుకున్న అప్పులు. చిల్లర పాత్రలు, కథను పొడిగించడానికి ఉపాయాలు, హిందీ సినిమాలు కూతురు కాపురానికి ప్రదానం చేసిన కట్నాలు.

కూతురు కాపురం దర్శకులు శోభన్ రావు గారి వద్దనుంచి, నటులు జగ్గయ్య, జమున, రాజసులోచన, అమర్నాథ్ వగైరాల వద్ద నుంచిగాని, లేనిపేని అడగకుండా, ఉన్నదంతానైనా పుచ్చుకోకుండా, కదులూ లేకుండా సాగిపోయిన చిత్రం. హేమలత మాలిక్ కాదు కాబట్టి, జమున నర్గిస్ కాదు కాబట్టి, అమర్నాథ్ బాల్ రాజ్ సహానీ కాదు కాబట్టి, ఇంకా శోభనరావు గారు అమియా చక్రవర్తి, వి. ఎమ్. కోహార్లలోని ఉత్తమ లక్షణాల మేటి కలయిక అని ఎవ్వరూ అనుకోవడం లేదు కాబట్టి, సీమా, మిస్ ఇండియా కూతురు కాపురానికిచ్చిన కానుకలు బొంబాయినుంచి మద్రాసు వచ్చేవరకే మెరుగులు పోగొట్టుకున్నాయని ఆశ్చర్య పడనక్కరలేదు.

అన్ని రంగాల్లోనూ తెలుగు సినిమా లనుభవిస్తున్న దారిద్ర్యానికి నిజస్వరూపం విశ్వరూపా వారి కూతురు కాపురం.



నూట పదకొండు అవతారాలెత్తి ఫిలిం పాత్రికేయుల ఆధ్వర్యాన అఖండంగా సన్మానింపబడ్డ హాస్యనట సార్వభౌముడు

శ్రీ రేలంగి వెంకటరామయ్య

# జనవాణి

ఈ శీర్షికక్రింద వివిధ సమస్యలనుగూర్చి పాఠకులు చర్చించవచ్చు. తమ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెలిబుచ్చవచ్చు. వ్యక్తిగత దూషణలకుమాత్రం యిది వేదికకాదు. —సం. జ. రై.

### కోవూరుతాలూకా జమాబంది

లెక్కలు సరిగ్గా వ్రాయబడివున్నా, లేకపోయినా తాలూకాఫీసులోను, హుజూరు లోను గుమాస్తాల మామూళ్ల బాధలేని గ్రామాధికారి అంటూ ఎవ్వరూ వుండరనుకుంటాను. జమానులు పావులా అర్ధ అడగడంలో, యివ్వడంలో కొంత అర్థంవుంది. కాని గుమాస్తాలు బజారుకెక్కి పబ్లిక్ గా గ్రామాధికార్ల వద్ద మామూళ్లు గుంజడం నా ఇరవై సంవత్సరముల పర్యాయాలలో నేను చూడలేదు. ప్రతి కరణం రు. 100లు, ప్రతి గ్రామాధికారి రు. 50లు జమాబంది మామూళ్ళక్రింద సమర్పించుకోవాలనడం విపరీతంగావుంది. ఇంతకూ ఎవరికని ఏం ప్రయోజనం? కొత్త పెత్తని వాడైతే సరిగ్గా మూడు కాళ్ళమీద నడుస్తుంది గదా!

—ఒక గ్రామాధికారి

*

### బల్లిపల్లె ప్రసూతికేంద్రం

బల్లిపల్లె ప్రసూతి కేంద్రములో ఏప్రిల్ 12 తేదీనుండి మెటర్నిటీ అసిస్టెంటు లేదు. అందువల్ల బల్లిపల్లెలోను, చుట్టుప్రక్క గ్రామాల్లోను, గర్భిణి స్త్రీలు అనేక కష్టాలకు గురియగుచున్నారు. కావున జిల్లా హెల్తాఫీసరుగారు శ్రద్ధపుచ్చుకొని ఆకేంద్రంలో ఎవరినైనా ఒక మెటర్నిటీ అసిస్టెంటును నియమిస్తారని ఆశిస్తున్నాను.

—షేకు దస్తగిరి సాహెబ్

*

### అక్కంపేట పంచాయతీ

మా పంచాయతీకి రావలసిన భూమిశిస్తు సెస్సులను గురించి ఎన్ని పర్యాయములు జిల్లా కలెక్టరు గారికి అర్జీలు పెట్టుకొన్నను, సెస్సులవాటా మా పంచాయతీకి అందలేదు. 1362 నుండి 1367 ఫసలీవరకు మా పంచాయతీకి రావలసిన సెస్సుల వాటా దయతో యిప్పించవలసిందిగా కలెక్టరుగారిని కోరుచున్నాను.

అక్కంపేట —యం. నారపరెడ్డి

# పంచాంగం

నిమ్మగడ్డ వేంకటేశ్వరశాస్త్రి

### ముహూర్తము

మే నెల 31 తేది ఉదయం గం. 6–30 ని లకు వృషభలగ్నమున వివాహముహూర్తము కలదు.

### రోహిణి కార్తె

మే నెల 25 తేది మధ్యాహ్నం గం 1–27ని మొదలు జూన్ నెల 8 తేదీ మధ్యాహ్నం గం 12–33 నిల వరకు రోహిణీకార్తె.

పరా:– మే నెల 31 ఆదివారం హనుమజ్జయంతి.

### ఈ వారం తిథులు

| | | | |
|---|---|---|---|
| మే30 | శని | అష్టమి | ఉ 5–56 గం. ప. |
| 31 | ఆది | నవమి | ఉ 6–25 గం. ప. |
| జూన్1 | సోమ | దశమి | ఉ 7–18 గం. ప. |
| 2 | మంగళ | ఏకాదశి | ఉ 8–33 గం. ప. |
| 3 | బుధ | ద్వాదశి | ఉ 10–6 గం. ప. |
| 4 | గురు | త్రయోదశి | ఉ 11–48 గం. ప. |
| 5 | శుక్ర | చతుర్దశి | మ 1–37 గం. ప. |



